రాంపల్లి డబుల్‌బెడ్రూం ఇండ్ల పరిశీలన


డబుల్ బెడ్రూంలను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి తదితరులు

కీసర: నాగారం మున్సిపల్ పరిధిలోని రాంపల్లి డబుల్‌బెడ్రూం గృహసముదాయాలను నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి మంగళవారం పరిశీలించారు. లబ్ధిదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 6,200 ఫ్లాట్లు ఉండగా 200 నుంచి 300 వరకు మాత్రమే లబ్ధిదారులు నివాసం ఉంటున్నారని, మిగితా వారు కూడా నివాసం ఉండేలా అధికారులు చొరవ చూపాలన్నారు. ఇందులో స్థానికులకు కూడా 10 శాతం ఇండ్లు కేటాయించాలని గతంలోనే ప్రభుత్వాన్ని కోరామని గుర్తు చేశారు. కాగా గృహసముదాయల వద్ద మున్సిపల్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య నిర్వహణ, కాలనీ రహదారి క్లీనింగ్, ప్రతిరోజు సేకరించిన చెత్తను ఆటోల ద్వారా డంప్‌యార్డుకు తరలింపు తదితర పనులు చేపడుతున్నామని తెలిపారు. ఆయన వెంట వైస్ చైర్మన్ బండారి మల్లేశ్, కమిషనర్ రాజేంద్రకుమార్, మేనేజర్ చంద్రశేఖర్, డిప్యూటీ ఇంజినీర్ సుదర్శనం, రఘు, అసిస్టెంట్ ఇంజినీర్ నరేష్, జీహెచ్ఎంసీ డీఈ మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం


పదో వార్డులో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ నాగమణి తదితరులు



కీసర: పరిసరాల శుభ్రతతో వ్యాధులు దరిచేరవని దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ ఏ. నాగమణి అన్నారు. మున్సిపల్ పరిధిలోని పదో వార్డులో మంగళవారం నిర్వహించిన 'స్వచ్ఛతా హీసేవ' కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి, స్థానిక కౌన్సిలర్ కొత్త శ్రీలతారామారావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇండ్ల వద్ద ప్రతిరోజు తడి, పొడి చెత్తను వేరు చేసి ఇంటికి వచ్చే మున్సిపల్ ఆటో సిబ్బందికి అందజేయాలన్నారు. అనంతరం సాసిన్ చెరువులో నిమజ్జనం వ్యర్థాల తొలగింపును పరిశీలించారు. కార్యక్రమంలో నేతలు సంపలబోల్ హరిగౌడ్, మోర నరహరి, సోమేశ్, కొత్త రామారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రభు, ప్రజాప్రతినిధులు, కాలనీవాసులు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

పోచారం: మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ కొండల్‌రెడ్డి ఐదుగురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మల్లీశ్వరికీ రూ. 60 వేలు, రేఖ రూ. 27 వేలు, ప్రమీల రూ. 24 వేలు, ఎల్లయ్య రూ. 13500, చక్రపాణి రూ. 9 వేలు చొప్పున సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం మంజూరైందన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రెడ్యానాయక్, కౌన్సిలర్ మహేశ్, నాయకులు శేఖర్, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.


చెక్కులను అందజేస్తున్న చైర్మన్ కొండల్‌రెడ్డి

పైపులైన్ పనులు ప్రారంభం


పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ పావనీజంగయ్య

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని 3 వార్డులో రూ. 5 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న నీటి పైపులైన్ పనులను మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య, కమిషనర్ సాబేర్ అలీ, స్థానిక కౌన్సిలర్ సంగీతతో కలిసి మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, కౌన్సిలర్ వెంకట్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్, నర్సింగ్‌రావు, కోఆప్షన్ సభ్యుడు షౌకత్, నాయకులు రాధాకృష్ణ ముదిరాజ్, సుధాకర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, జంగయ్యయాదవ్, వెంకటేశ్‌ముదిరాజ్, సంజీవరెడ్డి, గోపాల్‌రెడ్డి, సిరాజ్, సునీల్ పాల్గొన్నారు.

ఆర్‌పీఎఫ్ ఆధ్వర్యంలో 'స్వచ్ఛతా హీ సేవ'

సస్టైనబుల్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన


ఎన్టీఆర్‌నగర్‌లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఆర్‌పీఎఫ్ అధికారులు

కుషాయిగూడ: మీర్‌పేట్-హెచ్‌బీకాలనీ డివిజన్, ఎన్టీఆర్‌నగర్‌లో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పిఎఫ్) ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. రైల్వేట్రాక్‌ల వద్ద పరిశుభ్రతపై దృష్టి సారించడంలో భాగంగా ఆర్‌పీఎఫ్ అధికారులు చౌపల్ పేరుతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ట్రాక్‌ల వద్ద పరిశుభ్రతలో సమాజ ప్రమేయంపై అవగాహన కల్పించారు. రైల్వే ట్రాక్‌ల వద్ద చెత్త వేయడం వల్ల కాలుష్యం, వన్యప్రాణులకు కలిగే నష్టాలతో పాటు ప్రజారోగ్యానికి హానికరమనే సందేశాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని మరింత పకడ్బందీగా అమలు చేసేందుకు కార్యాచరణ చేపట్టారు. కమ్యూనిటీ పోలీసింగ్ విధానం తరహాలో కమ్యునిటీ ఎంగేజ్‌మెంట్ మోడల్ పేరుతో స్థానిక నివాసితులను క్రియాశీల వాటాదారులుగా చేర్చాలని నిర్ణయించారు. ఎంపిక చేసిన వారు రైల్వే, పర్యావరణ పరిరక్షకులుగా ఉండటంతో పాటు రైల్వేట్రాక్‌ల వద్ద చెత్త డంపింగ్‌ను అడ్డుకోవాల్సి ఉంటుంది. ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులకు సమాచారం చేరవేయాల్సిన బాధ్యత వారిపై ఉంటుంది. సస్టైనబుల్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై స్థానికులకు అవగాహన కల్పించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. రైల్వే శుభ్రత సామూహిక బాధ్యతగా బావించాలన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛత సాధ్యమౌతుందన్నారు. అనంతరం స్థానికులతో ప్రతిజ్ఞ చేయించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



బోడుప్పల్: కాలనీల్లో నెలకొన్న సమస్యలకు సత్వర పరిష్కారం చూపుతామని బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. చెంగిచర్లలోని 1వ డివిజన్ కార్పొరేటర్ బింగి జంగయ్యయాదవ్‌తో కలిసి డివిజన్‌లో పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన పలు కాలనీల్లోని ప్రజలతో ముచ్చటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యలను త్వరతిగతిన పరిష్కరించేందుకు సరైన ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. మౌలిక వసతులైన తాగునీరు, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పారిశుద్ధ్యం, విద్యుత్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు వివరించారు. కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ బీ- బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, పలు కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్ అందించేందుకు కృషి

కుత్బుల్లాపూర్: పారిశ్రామిక ప్రాంతాల్లో నిరంతర విద్యుత్‌ను అందించేందుకు కృషి చేస్తున్నామని మేడ్చల్ డివిజన్ విద్యుత్‌శాఖ సీజీఎం సాయిబాబా అన్నారు. మంగళవారం దూలపల్లి ఇండస్ట్రియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యుత్ సమస్యలు- పరిష్కారం సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్థానికంగా నెలకొన్న విద్యుత్ సమస్యలను తెలుసుకున్న సీజీఎం లైన్లను ఆధునీకరించి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ రవికుమార్, డీఈ శ్రీనాథ్‌రెడ్డి, ఏడీఈ సత్యనారాయణ, ఏఈ వినాయకరాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిలోనే అడ్డుకట్ట దిశగా..

- మేడ్చల్ జిల్లాలో కొనసాగుతున్న ఎన్‌సీడీ సర్వే
- 30 ఏళ్లు దాటిన వారిపై ప్రత్యేక శ్రద్ధ.. నిర్ధారణ పరీక్షలు
- బీపీతో 1.15 లక్షలు, షుగర్ బాధితులు 72 వేల మంది గుర్తింపు
- ఆహార నియమాలు పాటించేలా జిల్లా వైద్యారోగ్య శాఖ అవగాహన


సర్వే నిర్వహిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

సాక్షి,సిటీబ్యూరో: ఉరుకులు, పరుగుల జీవితంలో ఆహారపు అలవాట్లు మారాయి. దీనికితోడూ సాంకేతికత పెరిగి శారీరక శ్రమ తగ్గడంతో వ్యాధులు చుట్టుముడుతున్నాయి. చిన్నాపెద్దా తేడా లేకుండా మధుమేహం, రక్తపోటు, గుండె జబ్బులు, కేన్సర్లు ఇలా రకరకాల దీర్ఘకాలిక వ్యాధులతో చాలామంది బాధపడుతున్నారు. పట్టణ జనాభా అధికంగా ఉన్న మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఇదే ధోరణి ఎక్కువగా ఉంది. దీంతో వాటిని ఆదిలోనే కట్టడి చేసి ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి జిల్లా వైద్యారోగ్య శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోంది. 30 ఏళ్లు దాటిన వారి ఆరోగ్య పరిస్థితిని అంచనా వేసేందుకు అసంక్రమిక వ్యాధుల నిర్ధారణ (ఎన్‌సీడీ) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నది. ప్రస్తుతం జిల్లాలో మూడో విడత సర్వే కొనసాగుతోంది.

మారుతున్న ఆహారపు అలవాట్లు..

మారుతున్న ఆహారపు అలవాట్లు వ్యాధులకు దగ్గర చేస్తున్నాయి. చిన్న వయస్సులోనే జంక్ పుడ్, ఇతరత్రా వాటికి అలవాటు పడుతున్నారు. కళాశాల స్థాయికి చేరగానే ధూమపానం, మద్యపానంతో పాటు గంజాయికి బానిస అవుతున్నారు. దీంతో 30-40 ఏళ్ల వయస్సు వారి ఆరోగ్యంపై ప్రభావాన్ని చూపుతోంది. అలాగే ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులపై ఎక్కువగా ఒత్తిడి ఉంటుండడంతో వారు కూడా మధుమేహం, రక్తపోటు వంటి బారినపడి జీవిత కాలం మాత్రలు మింగాల్సిన పరిస్థితులు ఎదుర్కొంటున్నారు.

ఆదిలోనే గుర్తించేలా..

మధుమేహం, రక్తపోటు, వివిధ రకాల కేన్సర్లను ఆదిలోనే గుర్తించి నివారించాలన్నా ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ఎన్‌సీడీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో మే నుంచి మూడో విడత సర్వే కార్యక్రమం కొనసాగుతోంది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 30 ఏళ్లు దాటిన వారు 17 లక్షల మంది లక్ష్యంగా సర్వేను నిర్దేశించారు. ఏఎన్ఎంలు, అంగన్‌వాడీలు ఇంటింటికీ తిరుగుతూ పరీక్షలు చేస్తున్నారు. ఇప్పటి వరకు 5,76,242 మందిని స్క్రీనింగ్ చేసి పరీక్షించగా 1.15 లక్షల మంది రక్తపోటు (బీపీ)తో 72 వేల మంది మధుమేహం (షుగర్) వ్యాధికి గురైనట్లు వైద్యాధికారులు గుర్తించారు. వారికి ప్రతి నెల ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి మళ్లీ పరీక్షలు చేసి మందులు అందిస్తున్నారు. అలాగే పలువురు వివిధ రకాల కేన్సర్లతో బాధపడుతున్నట్లు నిర్ధారించారు.

ఆహార నియమాలు పాటించాలి..

ఆహార నియమాలు పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. నిత్యం కొంత సమయాన్ని వాకింగ్, యోగాకు కేటాయించాలి. తద్వారా ఒత్తిడిని నియంత్రించి వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చు. సమతుల్య ఆహారం తీసుకోవాలి. మధుమేహంతో బాధపడుతున్న వారు నిల్వ ఆహారం తీసుకోకుండా చూడాలి. జిల్లాలో ఎన్‌సీడీ సర్వే కొనసాగుతోంది. వ్యాధులు నిర్ధారణ అయిన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నాం.

– డాక్టర్, కౌశిక్, ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా

వివాదాస్పద స్థలం పరిశీలన

పోచారం: నారపల్లిలోని సర్వే నంబర్-27లోని వివాదాస్పద స్థలాన్ని లోకాయుక్త విచారణాధికారి మ్యాథ్యూ కోశీ మంగళవారం పరిశీలించారు. ఇందులో రెండు ఖాళీ ప్లాట్లు తనకు ఉన్నాయని, వీటిని వినియోగించుకోనివ్వకుండా కొందరు వ్యక్తులు అడ్డుకుంటున్నారని మల్లేశ్ లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. దీంతో విచారణాధికారి మ్యాథ్యూ వివాదాస్పద స్థలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వే నిర్వహిస్తే బాధితులకు న్యాయం జరగవచ్చన్నారు.

వ్యక్తి అదృశ్యం


హేమంత్‌కుమార్

కీసర: వ్యక్తి అదృశ్యమైన ఘటన కీసర పోలీస్‌స్టేషన్‌పరిధిలో జరిగింది. కీసర సీఐ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం.. అహ్మద్‌గూడలో నివసించే సురం హేమంత్‌కుమార్ మంగళవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. కొన్ని గంటల తర్వాత పిల్లలు, తన తల్లిని బాగా చూసుకోవాలని సెల్‌ఫోన్‌కు సందేశం పంపాడు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు వెంటనే కాల్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. తెలిసిన వారితో పాటు, బంధువులు వద్ద వాకబు చేసినప్పటికీ ఫలితం లేకుండాపోయింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మల్లాపూర్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలైన ఘటన నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నాచారం హెచ్ఎంటీనగర్ రోడ్డు నెంబర్ 6లో నివాసం ఉండే ఉమాజానకీరామ్ (33) పండ్లు కొనేందుకు హెచ్ఎంటీనగర్ కమాన్ వద్దకు తన ద్విచక్ర వాహనంపై వస్తుండగా.. మల్లాపూర్ నుంచి హబ్సిగూడకు వైపు వెళ్తున్న ఆశోక్ లేలాండ్ వాహనం (టీఎస్11యూసీ 8852) అతివేగంగా వచ్చి బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అతడు కిందపడగా.. కాలికి తీవ్ర గాయమైంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

చింతల్: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని లార్డ్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు లయన్ సురేష్ కుమార్ అన్నారు. మంగళవారం గణేష్ నగర్‌లోని లార్డ్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ కార్యాలయంలో ఉచిత డెంటల్ క్యాంప్ నిర్వహించారు. స్థానిక మహిళలు, ఫాదర్ ఫ్రాన్సిస్ స్కూల్ విద్యార్థులు పాల్గొని దంత పరీక్షలు చేయించుకున్నారు. దంతాల పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. కార్యక్రమంలో లయన్ జీఆర్ సుజాత, సుష్మిత, వెంకట్, రాజేశ్వర్, వైద్యులు ప్రఫుల్ల, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'టెలీమానస్' అధికారిక పోస్టర్ విడుదల



సాక్షి,సిటీబ్యూరో: కలెక్టరేట్‌లో టెలీమానస్ (టెలీమెంటల్ హెల్త్ అసిస్టెన్స్ అండ్ నెట్‌వర్కింగ్ అక్రాస్ స్టేట్స్) అధికారిక పోస్టర్‌ను జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) రాధికాగుప్తా మంగళవారం విడుదల చేశారు. టోల్ ఫ్రీ నంబర్ 14416 ద్వారా టెలీమానస్ సేవల్లో భాగంగా మానసిక ఆరోగ్య రోగులకు ఉచితంగా గోప్యమైన టెలిఫోనిక్ కౌన్సెలింగ్ సేవలు అందిస్తారన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టరు.రఘునాథ్‌స్వామి, జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్లు మల్లీశ్వరి, చంద్రకళ, గీతా ప్రసాద్, సరస్వతి, అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్లు వెంకట్ నరేశ్, కౌశిక్, జిల్లా ఏసీడీ కోఆర్డినేటర్ ఉమాపతిరెడ్డి పాల్గొన్నారు.

లోతుకుంట చెరువుకు లీకేజీ


జేసీబీతో నీటి లీకేజీకి మరమ్మతు చేయిస్తున్న ఏఈ పరమేశ్

ఘట్‌కేసర్: రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి అంకుసాపూర్‌లోని లోతుకుంట చెరువుకు మంగళవారం లీకేజీ ఏర్పడింది. దీంతో చెరువులోని నీరు బయటకు వెళ్లింది. విషయం తెలుసుకున్న మత్స్యకారులు గడ్డితో పాటు మట్టి తెప్పలతో అడ్డుపెట్టినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. దీంతో ఇరిగేషన్ ఏఈ పరమేశ్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన ఘటనా స్థలానికి చేరుకొని జేసీబీతో మరమ్మతులు చేయించారు. అయినా లీకేజీ ఆగకపోవడంతో సిమెంట్ సంచుల్లో మట్టి నింపి మరమ్మతులు చేపట్టారు. కానీ అప్పటికే చెరువులోని చేపలు బయటకు వెళ్లిపోయాయి. అధికారులు సకాలంలో స్పందించి ఉంటే నష్టం జరిగేది కాదని ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

సుభాష్‌నగర్: సూరారం ప్రధాన రోడ్డు నారాయణ మల్లారెడ్డి ఆసుపత్రి వద్ద ట్రాఫిక్ నియంత్రణపై అధికారులు చర్యలు చేపడుతున్నారు. మంగళవారం గాజులరామారం సర్కిల్ ఉప కమిషనర్ మల్లారెడ్డి, బాలానగర్ ఏసీపీ, జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్ నేతృత్వంలో నారాయణ మల్లారెడ్డి ఆసుపత్రి వద్ద ప్రధాన రోడ్డును పరిశీలించారు. స్థానికంగా పైపు చిన్నగా ఉండి చిన్నపాటి వర్షానికే రోడ్డుపై మోకాలు లోతు నీరు నిల్వ ఉంటుంది. దీంతో ట్రాఫిక్ సమస్య తలెత్తడంపై ఉప కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రధాన రోడ్డుపై కొన్ని దుకాణాలు ఉండడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారిందని, విస్తరణ చేపట్టాలని నిర్ణయించారు. త్వరలో పైపులైన్ సామర్థ్యం పెంచి నీరు వెళ్లేందుకు చర్యలు చేపడతామని ఉప కమిషనర్ తెలిపారు.

సొంత గూటిపై ఆశలు..!

- ఇటీవల సీఎం ప్రకటనతో చిగురించిన ఆశలు
- గాంధీ జయంతి తర్వాత తొలి విడతలో నియోజకవర్గానికి 3, 500 ఇండ్లు
- నగర శివారు మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలకు మంజూరు కానున్న ఇందిరమ్మ గృహాలు 45,500
- గత ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులు సుమారు 4 లక్షలు



సాక్షి,సిటీబ్యూరో: గాంధీ జయంతి తర్వాత తొలివిడతలో నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని ఇటీవల సీఎం ప్రకటించడంతో లబ్ధిదారుల్లో ఆశలు చిగురించాయి. ప్రభుత్వం ప్రకటించినట్లు నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలకు 45,500 గృహాలు మంజూరు కానుండగా, ఇందులో మేడ్చల్ జిల్లాకు సంబంధించి 17,500 , రంగారెడ్డి జిల్లాకు 28 వేల ఇండ్లు మంజూరు కానున్నాయి. గతేది డిసెంబర్ 28 నుంచి 2024 జనవరి 6 వరకు ప్రజాపాలన పేరుతో నగర శివారు జిల్లాల్లో అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. మార్చిలోనే ప్రతి నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇండ్లను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించినప్పటికీ చేయలేదు. అయితే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం గాంధీ జయంతి తర్వాత ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఆరు గ్యారంటీల పథకంలో భాగంగా గూడు లేని వారికి ఇంటి స్థలంతో పాటు ఒక్కో ఇంటికీ రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తామని ప్రభుత్వం పేర్కొన్న విషయం తెల్సిందే. తొలి విడతలో ఇంటి స్థలం ఉన్నవారికి మాత్రమే పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. లబ్ధిదారులను గుర్తించి రూ.5 లక్షలు మంజూరు చేయాలని, వీటిని ఇంటి నిర్మాణానికి అనుకూలంగా నాలుగు విడతల్లో అందించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఎస్సీ, ఎస్టీలకు మాత్రం ఇంటి స్థలాలు మంజూరు చేసి వాటి నిర్మాణాలకు నిధులు విడుదల చేయాలని ఆలోచిస్తోంది. గ్రామాలు, పట్టణాల వారీగా ప్రభుత్వ స్థలాలను గుర్తించే పనిలో రెవెన్యూ అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది.

ప్రజాపాలనలో సుమారు 4 లక్షల దరఖాస్తులు..

నగర శివారు జిల్లాల్లో ప్రజాపాలన కార్యక్రమంలో సుమారు 4 లక్షల వరకు ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన దరఖాస్తులు వచ్చాయి. పురపాలక సంఘాల్లోని డివిజన్లు/వార్డులు, గ్రామాల నుంచి వందల సంఖ్యలో దరఖాస్తులు రాగా, ఎంపిక ఎలా ఉంటుందన్న ఆందోళన దరఖాస్తుదారుల్లో మొదలైంది. నియోజకవర్గానికి 3,500 చొప్పున పురపాలికలు, గ్రామాలను విడదీస్తే.. అర్హులందరికీ కూడా ఇండ్లు ఇవ్వలేని పరిస్థితి కనిపిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఇండ్ల ఎంపికలో ఎవరికీ ప్రాధాన్యం ఇస్తారో స్పష్టత రాలేదు. ఇప్పటికే దరఖాస్తుదారులు స్థానిక నాయకుల చుట్టూ తిరుగుతున్నారు. లబ్ధిదారుల ఎంపికకు మార్గదర్శకాలు రాలేదని, గుడిసెల్లో నివాసముండే వారికి ప్రాధాన్యం ఉంటుందని మాత్రం అధికారులు చెబుతున్నారు.

కార్మికుల సేవలు వెలకట్టలేనివి


కార్మికులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సుష్మ

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌ని శుభ్రంగా తీర్చిదిద్దడంలో కార్మికుల సేవలు వెలకట్టలేనివి కమిషనర్ ప్రవీణ్‌కుమార్ రెడ్డి అన్నారు. 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమంలో భాగంగా జవహర్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ సుష్మ ఆధ్వర్యంలో మంగళవారం శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ కృష్ణప్ప, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎఫ్ఎస్‌సీఎస్ మాజీ ఎండీపై ఫిర్యాదు

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ రైతు సేవా సహకార సంఘం మాజీ ఎండీ కరుణాకర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ హైదరాబాద్ రీజియన్ ఆఫీస్ యూనియన్ బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజర్, జిల్లా సహకార అధికారికి మంగళవారం ఫిర్యాదు చేశారు. ఎండీగా మరొకరు బాధ్యతలు స్వీకరించిన తర్వాత కూడా సంఘానికి చెందిన గోదాంను హైదరాబాద్ డిఫెన్స్ అకాడమీ సంస్థకు అద్దెకు ఇచ్చాడని, ఈ విషయమై పాలక మండలి ఎలాంటి తీర్మానం చేయలేదన్నారు. గత పాలకవర్గం ఇచ్చిన గడువు ముగిసినా అకాడమీని ఖాళీ చేయించకుండా బకాయిలు పడ్డా అదే సంస్థకు ఎండీగా బదిలీ తర్వాత కూడా గోదాంను అద్దెకు ఇచ్చి అవినీతికి పాల్పడ్డాడని చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశామని తెలిపారు.

కాలనీల్లో డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి


జీహెచ్ఎంసీ కమిషనర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని 7 కాలనీలకు డ్రైన్ ఔట్‌లెట్ లేక ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఈ సమస్యపై మంగళవారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలిని కలిసి చర్చించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఏడు కాలనీలకు సరైన డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయకుండా బహుళ అంతస్తుల భవనాలకు అనుమతులు ఇవ్వడం, పాత డ్రైనేజీ వ్యవస్థలోనే కలపడం ద్వారా కాలనీలో డ్రైనేజీ మురుగు రోడ్లపైకి ప్రవహిస్తూ.. ఇబ్బందులు పడుతున్నారన్నారు. తుర్కపల్లి ప్రాంతంలో హకీంపేట ఎయిర్‌పోర్స్ లోపలి నుంచి వర్షపు నీటితో రోడ్లన్నీ జలమయం అవుతున్నాయన్నారు. దీనిపై కమిషనర్ స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారని చెప్పారు. నాయకులు రావుల అంజయ్య, పరుశురామ్‌రెడ్డి, జీఎ.హన్మంతరావు, దోలి రమేష్, ఉపేందర్‌రెడ్డి, అనిల్‌కిషోర్, రాముయాదవ్, వెంకటేష్ యాదవ్, సందీప్‌రెడ్డి, కాలనీ సభ్యులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కూల్చివేతలు


మల్లాపూర్‌లో ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

మల్లాపూర్: జీహెచ్ఎంసీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మల్లాపూర్‌లో రెండోరోజు మంగళవారం రోడ్డు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకుని వ్యాపారుల నిర్వహిస్తున్న డబ్బాలు, నిర్మాణాలను జేసీబీతో కూల్చివేశారు. అనంతరం కాప్రా సర్కిల్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ గిరిరాజ్ మాట్లాడుతూ.. ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తే సహించబోమని హెచ్చరించారు. టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రామంతాపూర్: జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రామంతాపూర్ ప్రధాన రహదారితో పాటు అంతర్గత రహదారుల్లో ఉన్న ఫుట్‌పాత్ ఆక్రమణలను ఉప్పల్ సర్కిల్ జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు సోమవారం నుంచి చేపట్టిన కూల్చివేతలు మంగళవారం కూడా కొనసాగాయి. రామంతాపూర్ ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న నెహ్రూనగర్‌లో ఫుట్‌పాత్ ఆక్రమణలను అధికారులు కూల్చివేశారు. కూల్చివేసిన ఆక్రమణలను తిరిగి నిర్మించకుంటే ఇదే వారంలో తిరిగి కూల్చివేతలు చేపడతామని టౌన్‌ప్లానింగ్ అధికారులు హెచ్చరించారు. జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.